విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 03, ఆగష్టు 2024

చిన్నవంగలి సంఘటన చాలా బాధకరం : ఎంపీ

ప్రసన్న భాద్యత నేనే తీసుకుంటా : ఎంపి బైరెడ్డి శబరి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలం చిన్నవంగలిలో తీవ్ర విషాదం చోటు చేసుకుందని, ఈ విషాద సంఘటన అందరిని కలిసివేస్తోందని, ప్రసన్న చదువు బాధ్యత పూర్తిగా తాను తీసుకొని ఆ బాధిత కుటుంబానికి అండగా ఉంటానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడడం బాధేస్తోందన్నారు. కుటుంబంలో మొత్తం ఐదుగురు సభ్యులు ఉండగా, రెండో కుమార్తె ప్రసన్న కడప జిల్లా ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో చదువుతోందని, ఈ తీవ్ర విషాద ఘటన గురువారం అర్ధరాత్రి సమయంలో జరిగినట్లు తెలుస్తోందని, శుక్రవారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు శిథిలాలను తొలగించి చూడగా అప్పటికే నలుగురు మృతిచెందడం, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాతపడటం కలిసివేస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందించేందుకు కృషి చేస్తూ పదో తరగతి చదువుతున్న ప్రసన్న ఉన్నత చదువుల పూర్తి బాధ్యత తాను తీసుకుంటానని ఆమె తెలిపారు.

// సంక్షిప్త సమాచారం //

శ్రీశైలం మల్లన్న హుండీ ఆదాయం..

విశాలాంధ్ర - శ్రీశైలం: ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలం మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు గత 29 రోజుల నుంచి భక్తులచే సమర్పించబడిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.3,31,70,665 నగదు, 127 గ్రాముల బంగారు, 4 కేజీల 400 గ్రాముల వెండి, పలు రకాల విదేశీ కరెన్సీ స్వామి అమ్మ వార్లకు రాబడిగా లభించాయి. ఈ హుండీ లెక్కింపు అంతా పటిష్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య, సీసీ కెమెరాల నిఘాలో లెక్కించినట్లు కార్య నిర్వహణ అధికారి డి.పెద్దిరాజు తెలిపాడు.

రూ.5 లక్షల పరిహారం అందజేస్తాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చిన్నవంగలి గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగిన విషాధ ఘటనపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉండి, ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం అంది స్తామని హామీ ఇచ్చారు. గురువారం అర్ధరాత్రి మట్టి మిద్దె కూలి మృతి చెందిన శేఖర్ రెడ్డి రెండవ కూతురు ఉన్నత చదువుల కోసం టీడీపీ తరుపున ఖర్చంతా చూసుకుంటామని ఆమె తెలిపారు. బాధిత కుటుం బానికి ఎల్లవేళలా తాము అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.

విద్యార్థులలో నైపుణ్యం పెంచేందుకు కృషి చేయండి

విశాలాంధ్ర - చాగలమర్రి : విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని చిన్నవంగలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చాగలమర్రి పట్టణంలోని కస్తూర్బా గురుకుల పాఠశాల ,జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రధాన పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, వివిధ రికార్డులను పరిశీలించి, విద్యార్థులకు వండిన బోజన పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సామర్థ్యాన్ని పెంచేలా విద్యాబోధన ఉండాలన్నారు. విద్యా పరికరాల ద్వారా పాఠశాలల్లో విద్యను బోధించాలన్నారు. కస్తూర్బా గురుకుల పాఠశాలలో నెలకొన్న ప్రహరి గోడ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అలెస్కో రఘురామి రెడ్డి, ఎంఈఓ అనురాధ, హెచ్ఎంలు జీవయ్య, కోటయ్య, కస్తూర్బా ప్రిన్సిపల్ సునీత,శేషాద్రి లు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే సహాయం

విశాలాంధ్ర - వెలుగోడు: ప్రమాదంలో మృతి చెందిన బాధితురాలు భర్తకు జనతా యాక్సిడెంట్ పాలసీ కింద రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శుక్రవారం అందజేశారు. వెలుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు అబ్దుల్లా పురం గ్రామానికి చెందిన ఈడిగ నాగలక్ష్మమ్మకు పంట రుణము మంజూరు అయింది. ఆమె గతేడాది ఆగష్టు 23న ఆటో ప్రమాదంలో మృతి చెందిందన్నారు. ఆమె భర్త ఈడిగ లక్ష్మన్నకు ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ సూపర్వైజర్ శ్రీనాథ్, సీఈవో జంబులయ్య, అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన రఘు స్వామి రెడ్డి, రామకృష్ణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - రుద్రవరం: ఈనెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ భవనం నందు ఈనెల 6న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మబ్బు బాలస్వామి అధ్యక్షతన నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ సమావేశానికి ఆయా శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు వారి వారి ప్రగతి నివేదికలతో సమావే శానికి హాజరవ్వాలని ఆయన తెలిపారు.

పింఛన్ మొత్తంతో పరారైన ఉద్యోగి సస్పెన్షన్, అరెస్ట్

విశాలాంధ్ర - నంద్యాల : పింఛన్ సొమ్ముతో పరారైన వెంగళంపల్లి సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ పవన్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శుక్రవారం తెలిపారు. ప్యాపిలి మండలం వెంగళంపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ పథకం కింద 50 మంది పెన్షన్ దారులకు పంపిణీ చేయవలసిన మొత్తం రూ.2,23,500లతో పరారైన సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ పవన్ కుమార్‌ను సస్పెండ్ చేయడంతో పాటు అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. సంబంధిత మొత్తాన్ని తల్లితండ్రులను పిలిపించి వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు రిమాండ్‌కు పంపడం జరిగింద న్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయ్యుండి బాధ్యతారహితంగా ప్రవర్తించడం సమంజసం కాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తీవ్ర కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

బయోమందుల అమ్మితే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర - పాములపాడు : పురుగుమందు దుకాణాలలో బయో మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు వ్యవ సాయ శాఖ సహాయక సంచాలకులు ఆంజనేయులు హెచ్చరించారు. మండలం మండల కేంద్రమైన పాములపాడులో శుక్రవారం వ్యవ సాయ శాఖ కార్యాలయం నందు మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వ రెడ్డి ఆధ్వర్యంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయులు మాట్లాడుతూ దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్స్, బిల్ బుక్స్ అప్డేట్ చేసుకోవాలని, స్టాక్ రిపోర్టు ప్రతి నెల ఐదో తేదీ లోపల కార్యాలయానికి ఇవ్వాలని చెప్పారు. అనుమతి లేని బయోలు దుకాణములలో పెట్టి అమ్మకూడదు అని, అమ్మినచో ల్యాబ్‌కు శాంపుల్ తీసి పంపడం జరుగుతుందనీ హెచ్చరించారు. ఇతరులు వచ్చి గ్రామంలో లైసెన్సు లేకుండా అమ్మితే వారి గురించి సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని గౌతమ్ మోడల్ పాఠశాలలో శు క్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ ప్రైవేట్ పాఠశాలల నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష ఆధ్వర్యంలో పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ లో కరస్పాండెంట్ విక్టర్, ప్రిన్సిపాల్ ప్రశాంతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థి బృందంతో కలిసి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రౌడీషీటర్ దారుణ హత్య

విశాలాంధ్ర - నంద్యాల : అయ్యలూరు మెట్ట వద్ద రౌడీషీటర్ అల్లూరి వెంకట సాయి అలియాస్ ఖవ్వా సాయి దారుణ హత్య స్థానికంగా కలకలం రేపింది. అల్లూరి వెంకటసాయి అలియాస్ ఖవ్వా సాయి అనే రౌడీ షీటర్‌ను గుర్తు తెలియని దుండగులు కత్తులతో వేటాడి మరీ దారుణంగా హతమార్చారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి వెంకటసాయి అలియాస్ ఖవ్వా సాయి అనే రౌడీ షీటర్‌ను గుర్తుతెలియని దుండగులు కత్తులతో వేటాడి మరీ దారుణంగా హతమార్చారు. నంద్యాలలో 2022లో కానిస్టేబుల్ సురేంద్ర హత్య కేసులో కవ్వా సాయి ప్రధాన ముద్దాయి. ఖవ్వా సాయి మరో ముగ్గురితో కలిసి కానిస్టేబుల్‌ను వెంటాడి చంపారు. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ బాడీగార్డ్ నిఖిల్‌పై హత్యాయత్నం కేసులోనూ మృతుడు ముద్దాయిగా ఉన్నాడు. పాత గొడవల కారణంగానే కవ్వా సాయిని హత్య చేసినట్లు తెలుస్తోంది. హతుడిని మరో గ్యాంగ్ సభ్యులు అయ్యలూరు మెట్ట శివారు ప్రాంతంలోని ఓ వెంచర్ వద్ద వెంటాడి మరీ నరికి చంపారు. పోలీసులు, జిల్లా ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ కవ్వ సాయిని గుర్తు తెలియని వ్యక్తులు అతి దారుణంగా హత్య చేశారని, నిందితులను పట్టుకుంటామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పథకం ప్రకారమే రౌడీ షీటర్ అల్లూరి వెంకటసాయి అలియాస్ ఖవ్వాసాయిని మట్టుపెట్టారా, లేక రౌడీషీటర్ల మధ్య గ్యాంగ్ వార్‌ా అనేది విచారణలో తేలాల్సి ఉంది.

మిద్దెకూలి నలుగురు కుటుంబ సభ్యులు మృతి చెందడం బాధకరం : సీపీఐ

- మృత్యువాత పడ్డ కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా చాగల్లమర్రి మండలం చినవంగలిలో మిద్దె కూలి నలుగురు ఒకే కుటుంబ సభ్యులు మరణించడం బాధాకరమని, రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం రాత్రి కుటుంబ సభ్యులు మిద్దెలో పడుకొని ఉండగా, ఉన్నపాటున మిద్దెకూలడంతో కుటుంబ సభ్యులు గురుశేఖర్ రెడ్డి, దస్తగిరమ్మ దంపతులు, వారి ఇద్దరు కుమార్తెలైన పవిత్ర (16), గురులక్ష్మి (10)లు మృతి చెందడం చాలా బాధాకరమని ఆవేదన చెందారు. కుటుంబ సభ్యులలో పదో తరగతి చదువుతున్న ప్రసన్నను ఉన్నత చదువులు చదువుకునేందుకు అన్ని వసతులు రాష్ట్ర ప్రభుత్వమే కల్పించి ఆదుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు చిన్న వంగలి గ్రామంలో జరిగిన సంఘటన పరిశీలించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందించేందుకు కృషి చేయాలని వారు కోరారు.

గడ్డి మందుతో పంట పొలాలను నాశనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్: పంటలు నష్టపరిచే సంస్కృతి తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు అన్నారు. మండలంలోని ఇందిరాంపల్లి గ్రామంలో కిల్లే సుంకన్న, కిల్లే రామేశ్వర్‌ల సర్వేనెంబర్ 388/1 389లో నాలుగు ఎకరాలు, సద్ద, కంది పంటను గడ్డి మందుతో జూన్ 28న రాత్రి సమయంలో నాశనం చేశారని, 29న డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తెలిపారు. 30న సాయంత్రం సీఐకి రైతులను తీసుకొని సీపీఐ నాయకులు వెళ్లి పిర్యాదు చేస్తే 31వ తేది కేసు నమోదు చేశారన్నారు. ఆగస్టు ఒకటో తేదీ ఇందిరాంపల్లి గ్రామంలోని రైతుల పంట దగ్గరికి వెళ్లి రూరల్ సీఐ పరిశీలన చేసి వచ్చారు. శు క్రవారం నాడు స్థానిక నక్కి రామన్న భవన్ లోపంట నష్టపోయిన రైతులతో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ మండల సహాయ కార్యదర్శి వరద రాజు, రాధాకృష్ణ, ప్రతాప్‌తో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడేళ్ల నుండి ఈ గ్రామంలో ఈ భూమి వివాదంలో కొనసాగుతోందని. ఈ సమస్యపై డోన్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారని, సుంకన్న, రామేశ్వరావు పొలం రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ న్యాయం ఉంది కాబట్టి వారు ప్రతి సంవత్సరం పంట పొలాన్ని వేసుకుంటు న్నారని తెలిపారు. ఈ ఏడాది సైతం పంట పొలాన్ని వేసుకున్నారన్నారు. దీన్ని ఓర్వలేని ఆ గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు రైతులను నష్టం చేయాలని ఉద్దేశంతో, పంటను నష్టం చేశారని, ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ సాంప్రదాయం డోన్ మండలంలో లేదని, ఈ ప్రాంతంలో కొత్త సాంప్రదాయానికి తెర లేపారని దీనిపై పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని, పంట నష్టం చేయడంలో పాల్గొన్న వారిని ప్రోత్సహించిన వారన్నారు. కఠినమైన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలం అయ్యారని, పంటను నాశనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏడాదంతా కష్టపడిన పంట చేతికి వచ్చే సమయానికి ఇలాంటి పనికి పూనుకోవడం మంచిది కాదని వారన్నారు. వెంటనే అగ్రికల్చర్ అధికారులు పోలీసులు స్పందించి రైతులకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నంద్యాల జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

ఈనెల 8న విద్యా కమిటీ సభ్యుల ఎన్నికలు

విశాలాంధ్ర - రుద్రవరం : ఈ నెల 8న పాఠశాలల విద్యా కమిటీ సభ్యుల ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి కోటయ్య తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు పాఠశాలల అభివృద్ధి కొరకై ఈనెల 8న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నూతన విద్యా కమిటీ సభ్యుల ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేరోజు ఎన్నికైన కమిటీ సభ్యుల చేత 1:30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడం జరుగు తుందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యా కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికైన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించడం జరుగుతుందన్నారు.

పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

విశాలాంధ్ర - నంద్యాల : పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తు వారి సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం పోలీసుల సమస్యల పరిష్కారం కొరకు పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది వారి సమస్యల గురించి అనగా ట్రాన్స్ఫర్స్, రిక్వెస్టు, మెడికల్ సమస్యలు, సస్పెన్షన్ నుండి విధులకు మొదలగు సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ వారి సమస్యలను తెలుసుకొని, సమస్యలకు తగిన పరిష్కారం చూపుతానని, సంభందిత అధికారులకు ఆదేశాలిచ్చి సిబ్బందికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఇన్స్‌పెక్టర్లు జయరాములు, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

రాజోలి రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తా

విశాలాంధ్ర - చాగలమర్రి : రైతుల కళ రాజోలి ఆనకట్ట నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు కృషి చేస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాజోలి ఆనకట్ట నుండి కేసీ కాలువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 92 వేల ఎకరాల ఆయకట్టు విస్తీర్ణానికి సాగునీటిని అందించే ప్రాజెక్టు రాజోలి అన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి 1380 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయని, 9980 ఎకరాల భూసేకరణ జరపాలన్నారు. రాజోలి ఆనకట్ట కేసీ కెనాల్ కింద 51,268 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. టెండర్ పేరు చెప్పి వైసీపీ ప్రభుత్వం నాయకులు ఇసుక అమ్ముకున్నారన్నారు. జపాన్ నుండి నిధులు తీసుకొని వచ్చే కేసీ కాలువను ఆధునికరించిన వ్యక్తి సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వరెడ్డి, డీఈ బ్రహ్మారెడ్డి, ఏఈ జమాల్‌వలి, టీడీపీ నాయకులు బోరెడ్డి రమణారెడ్డి, శేషయ్య, వెంకటరమణ, శ్రీనివాస్, మహబూబ్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు చెల్లదు.. పునఃపరిశీలించాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : కేంద్రంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాల సంఘాల నాయకులు మురహరి మల్లయ్య పీకేశాలు ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని పాత బస్టాండ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో గంట పైబడి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. మాల మహానాడు జిల్లా నాయకులు మురారి మల్లయ్య, మల్లె ఎలీషా, పి.కేశాలు, ఎస్సీ, ఎస్టీ, మార్జిన్ కమిటీ సభ్యులు దిలీప్ కుమార్, లాయర్ చింతలయ్య, మండల అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ గతంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కొట్టు వేసిన ఇదే అత్యున్నత న్యాయస్థానం నేడు ఏడుగురు జడ్జీల ధర్మాసనం ఏ విధంగా వర్గీకరణ సమంజసమని, తీర్పు ఇచ్చిందో ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే తీర్పు వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు అంబేద్కర్ వాదులు గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు క్రిస్టఫర్, పాతకోట భాస్కర్, రాఘ వేంద్ర, అంకిరాజు, అనితారావు, సకనాల సురేష్, పాములపాడు నాయకులు అంకన్న, రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాటానికి దక్కిన విజయం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఎంతో హర్షనీయమని, ఎమ్మార్పీఎస్ పోరాటానికి దక్కిన విజయమని మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బెలుం సింగవరం గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లా డుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మాదిగ, మాదిగ ఉపకులాల కల నెరవేరిందన్నారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు చేసామన్నారు. ఏడుగురు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం ఎస్సీ, ఎస్టీ కోటాల ఉప వర్గీకరణపై తీర్పుతో అనగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. తీర్పుతో ఎవరికి అన్యాయం జరగదన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దయ్య, రామాంజనేయులు, బాల కంబయ్య, నడిపి దస్తగిరి, తిమ్మక్క, భాగ్యలక్ష్మి, సావిత్రి, బాల లచ్చమ్మ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆదరణ సేవాసమితి కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలోని మందలూరు గ్రామంలో వికలాంగుల ఆదరణ సేవా సమితి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని వికలాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు జజ్జూరి మరియ దాసు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కమిటీ అధ్యక్షులు బాల ఎల్లప్ప, దస్తగిరి రెడ్డి అధ్యక్షులు రామగోపాల్ సెక్రెటరీ, చిన్న బాలుడు వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్ సత్యరాజు, కార్యదర్శి నంద్యాల లింగారెడ్డి, కృపావతి మహిళా అధ్యక్షురాలు ,వికలాంగుల ఆదరణ సేవ కమిటీ సభ్యులుగా ఎన్నిక చేయడం జరిగిందన్నారు. పలు అంశాలపై రాష్ట్ర అధ్యక్షులు మరియదాసు మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగులు అంటే తక్కువ చూపుతో భావిస్తూ వికలాంగుల హేళన చేస్తున్న తెలంగాణ కలెక్టర్ సవిత సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు బట్టి చూస్తుంటే ప్రతివారికి తక్కువ చూపు కనపడడం జరుగుతుంది అన్నారు. మహిళా అధ్యక్షురాలు శివ నాగమ్మ రుద్రవరం మండల అధ్యక్షులు కే అబ్దుల్, చిన్న తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాయలసీమ అభివృద్ధి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : సీఎం చంద్రబాబుతోనే రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణా రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన స్వగృహం నందు విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ పోరాట యోధుడి వారసురాలు, ఎంపీ బైరెడ్డి శబరీ రాయలసీమ కరువుకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు ఆయన తెలిపారు. రాయలసీమ కరువు, దాని రూపు మాపే నీటి ప్రస్తావనను ముఖ్యమంత్రి ముందు ప్రస్తావించడం శబరికికే సాధ్యమయిన్నారు. తరతరాల రాయలసీమ నీటి కష్టాలకు దగ్గర దారి చూపిన ధీర వనిత శబరీ అన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు బైరెడ్డి రాజ శేఖరరెడ్డి వారసురాలిగా తండ్రి ఆశయాలకు ప్రతిబింబం, రాయలసీమ వాదుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన రాయలసీమ ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ నిర్మించాలని వివరించడం అభినందనీయమన్నారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్, ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో జిల్లా ఆసుపత్రి తల్లీబిడ్డల ప్రత్యేక విభాగంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్అధ్యక్షులు నిజాముద్దీన్ అధ్యక్షతన నెరవాటి ఆసుపత్రి నిర్వాహకులు, నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్య క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాదరావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా, ఆర్ఎంఓ డాక్టర్ శిరీష, నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ, ఆసుపత్రి స్త్రీ, ప్రసూతి విభాగ అధిపతి డాక్టర్ పద్మజ, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ అరుణ జ్యోతి పాల్గొన్నారు. తల్లి పాల విశిష్టతపై డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ పద్మజ, డాక్టర్ అరుణ జ్యోతి గర్భవతులకు, చంటి బిడ్డల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్య దర్శి శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ళ నాగరాజు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ సహదేవుడు, ఉపాధ్యక్షులు సోమేశుల నాగ రాజు, ఆంజనేయులు గుప్తా, మేడా చంద్రశేఖర్, డాక్టర్ నాగరేఖ, డాక్టర్ అనూష, డాక్టర్ అనిత తదితరులు పాల్గొని 200 మంది గర్భిణీ స్త్రీలు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - నంద్యాల: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ.పద్మజ, ఇన్చార్జి డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ శారదబాయిలతో కలిసి తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని, దీంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి అంటు వ్యాధులు సంభవించకుండా ఉంటాయన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లికి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. తల్లిపాలలో ముఖ్యమైన పోషకాలు లభిస్తాయని, బిడ్డను అనేక రోగాల నుండి సురక్షితంగా ఉంచుతాయని ఆమె తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డల మధ్య బంధాన్ని పెంపొంది స్తాయన్నారు. ఆరు నెలలు పైబడిన శిశువులకు తల్లి పాలతో పాటు అదనపు ఆహారాన్ని అందించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఎంహెచ్‌వో డాక్టర్ శారదాబాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి, డాక్టర్లు శ్రీజ, తేజస్విని, శ్రీదేవి, డెమో రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : విద్యార్థిని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వర వెంకటప్రసాద్ అన్నారు. స్థానిక ప్రజ్ఞ కళాశాలలో శుక్రవారం న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా మాదకద్రవ్యాలు, విద్యార్థులపై వాటి ప్రభావం అనే విషయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలు అనేవి టీనేజీ చివర్లో అనగా ఇంటర్మీడియట్ దశలో అలవాటు అయ్యే అవకాశం ఉందన్నారు. ఒక్కసారి మాదకద్రవ్యాలకు అలవాటు పడిన మనుషులు సృజనాత్మకతను కోల్పోతారని, తమపై తాము నియంత్రణ కోల్పోయి మానసిక, శారీరక సమస్యలను ఎదుర్కో వాల్సి ఉంటుంది కాబట్టి, ఈ వ్యసనాలకు దూరంగా ఉండటం ఆరోగ్యానికి, సమాజా నికి చాలా మంచిదన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పట్టణ ఎస్ఐ నగీన మాట్లా డుతూ నేరాలు పాల్పడేవారు ఎక్కువ భాగము మాదకద్రవాలకు బానిసలైన వారెనని, ఒక్కసారి నేరానికి పాల్పడితే వారి జీవితం కటకటాల వెనుక వైపే ఉండాల్సి వస్తుందని ఆ పరిస్థితి విద్యార్థులకు రాకూడదంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. డాక్టర్ శబరిస్ మాట్లాడుతూ విద్యార్థి వయసులో శరీరక దారుఢ్యం చాలా అవసరమని ఇది మానసికంగా బలంగా ఉండడానికి తోడ్పడుతుందన్నారు. ప్రజ్ఞా విద్యా సంస్థల చైర్ పర్సన్ హేమలత రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య అనేది రెండు మార్గాలకు వారధి లాంటిదని, ఉన్నతమైన మార్గానికి బలమైన పునాదులు ఇక్కడే నిర్మించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమాదేవి, షాహినా బేగం, పట్టణ ఎస్సై నగీనా, డాక్టర్ శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా దర్శనమిచ్చిన కాళికామాత అమ్మవారు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్థానిక విశ్వరూప నగర్‌లోని కాళికామాత దేవాలయం నందు దేవాలయ కమిటీ అధ్యక్షుడు, శిల్పి దురుగడ్డ రవీంద్ర చారి, మహిళా కమిటీ అధ్యక్షురాలు దురుగడ్డ అనురాధ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు విల్లనూరు చంద్రశేఖర్ ఆచారి అమ్మవారికి అభిషేకం నిర్వహించి కూరగాయలతో శాకంబరీగా దేవిగా అలంకరించారు. అనంతరం భక్తులచే శ్రీ చక్రానికి కుంకుమార్చన నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా పట్టణ ఎస్ఐ నగీన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఆషాడ మాసం సాంప్రదాయాలను కొనసాగిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎస్సై నగినను ఆలయ మహిళా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

శాస్త్రీయ విద్యా విధాన అమలుకు విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయకరణకు వ్యతిరేకంగా శాస్త్రీయ విద్యా విధానంపై విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈసమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ విజేంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, సమీవుల్లా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నటువంటి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని వర్తింపు చేసే విధంగా ఎన్డీఏ కూటమి ఆలోచన చేయాలని సందర్భంగా కోరారు.ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అందరూ కూడా పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చి చదువుకుంటున్నారనీ, వారికి ఉచితవిద్యతోపాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు,మధ్యాహ్న భోజన పథకం లేకపోవడంతో ప్రభుత్వ కళాశాలలో చేరుబోయే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.తక్షణమే యువగళం పాదయాత్రలో లోకేష్ మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి కొనసాగిస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని నిర్వీర్యం చేస్తే.. విద్యార్థులను ఐక్యం చేసి పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఖాదర్,దస్తగిరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు

మహిళల హక్కుల సాధనకై ఉద్యమాలు చేపట్టాలి-పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: మహిళలహక్కుల సాధనకై ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జనరల్ బాడీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పి. రామచంద్రయ్య మాట్లాడుతూ సమాజంలో మహిళలు కుటుంబ భారాన్ని మోస్తూ, పురుషులతోపాటు వ్యవసాయ పనులు చేస్తూ, వర్తక వ్యాపారాలలో భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ లో గీతా ముఖర్జీ వంటి వారు సుదీర్ఘకాలం పోరాటం చేసినా నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకారులకు వ్యతిరేకంగాపోరాటం చేసిన చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవిలను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు తమ హక్కుల సాధనకై ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలుగా విజయలక్ష్మి

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షులుగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా సావిత్రి, రంగమ్మ, సుంకులమ్మ, కార్యదర్శిగా చంద్రమ్మ, సహాయ కార్యదర్శులుగా రాజేశ్వరి, సుశీలమ్మ, రామాంజనమ్మ, కోశాధికారిగా రాజేశ్వరిలను ఎన్నుకోవడం జరిగింది. ఈసమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు ఎంకే సుంకన్న, మహిళా సమాఖ్య నాయకురాలు సరస్వతి, జెరీన, మాధవి, సువర్ణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రకటన పట్ల హర్షం

విశాలాంధ్ర-కర్నూలు : కృష్ణానదిపై సిద్దేశ్వరం వద్ద తీగల వంతెన బదులు అలుగు-వంతెన నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. నిరంతరం కరువు, కాటకాలతో అల్లాడే రాయలసీమ ప్రజలకు సాగు, తాగునీరు అందించేదుకు ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించేందుకు సిద్దేశ్వరం అలుగు ఉపయోగ పడుతుంది. పోలవరం పూర్తి అయితే కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లించేందుకు అవసరమయిన రిజర్వాయర్ లు లేవు. కేవలం వరద నీటిని మాత్రమే ఉపయోగించుకోవడం జరుగుతుంది. ఇప్పటికైనా గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టెందుకు వెనుక బడిన ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజి నిధులు వినియోగించి పూర్తి చేయాలని,ఏపీపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడు కోవడానికి కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేశారు.

మండల సమస్యలు పరిష్కరించండి-ఎమ్మెల్యేకు సీపీఐ నీయకుల వినతి

విశాలాంధ్ర-తుగ్గలి: మండలం చాలా వెనుకబడిన మండలమని నిత్యం కరువు కాటకాలకు నిలయమై రైతులు వ్యవసాయ కూలీలు అప్పులతో, వలసలతో జీవనం కొనసాగిస్తున్నారని పాలకులు మారిన ప్రజల జీవన స్థితిగతులు మారలేదని ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబుకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నబిరసూల్, మండల కార్యదర్శి సుల్తాన్‌లు వివరించారు. శుక్రవారం వారు ఎమ్మెల్యే శ్యాంబాబును కలసి మెమోరాండం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో రాంపల్లి, జొన్నగిరి చెరువులను మినీ రిజర్వాయర్లుగా మార్చాలని దీనివల్ల మండలంలోని రైతులకు సాగినీరు అందితే కరువును పారద్రోల వచ్చని అదేవిధంగా క్రిష్ణగిరి నుండి జొన్నగిరి దాక బీటీ రోడ్డు వేయించాలని దీనివల్ల వెల్దుర్తి కృష్ణగిరి మండలాల రైతులు పత్తికొండకు రావడానికి సులువు అవుతుందని,శభాష్ పురం నుండి పత్తికొండ దాకా డబల్ రోడ్డు వేయించాలని,గతంలో టీడీపీ తీసుకొచ్చిన మినరల్ వాటర్ ప్లాంటేషన్ ఉప్పర్లపల్లి దగ్గర నుంచి గ్రామాలకు సప్లై చేసిన మినరల్ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని మళ్లీ ప్రారంభించాలని, మండలంలోని చెరువుల అన్నింటికీ హంద్రీనీవా ద్వారా వెంటనే నీరు నింపాలని చెరువుల కింద ఉన్న ఫారెస్ట్ కంపెనీ ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ ద్వారా కంపచెట్లను తొలగించాలని, పెండేకల్లు ఆర్ఎస్ లో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ నూతన భవనం నిర్మించాలని, అదేవిధంగా మద్దికేర, తుగ్గలి, పెండేకల్లు, ఆర్ఎస్ రామలింగాయపల్లి స్టేషన్లలో ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని వివిధ సమస్యలతో కూడుకున్న మెమోరాండాన్ని ఎమ్మెల్యే శ్యాం బాబుకు సమర్పించారు.

ఎమ్మెల్యేను సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి వినోద్‌కుమార్ కలిసిన వారిలో ఉన్నారు.

ఎండుతున్న పంటలకు హంద్రీనీవా సాగునీరు అందించాలి

విశాలాంధ్ర-దేవనకొండ రూరల్: హంద్రీ-నీవాప్రధాన కాలువ ద్వారా మండలంలోని రైతాంగానికి సాగునీరు ఇచ్చి ఎండిపోతున్న పంటలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటిశెట్టి, సీపీఐ మండల ప్రధానకార్యదర్శి ఎం.నరసారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా 86 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం ఉన్నప్పటికీ కేవలం దేవనకొండ మండలానికి 46వేల హెక్టార్లకు సాగునీరు ఇచ్చే దిశగాప్రభుత్వం గణాంకాలు చెప్తున్నాయన్నారు కానీ పంటకాలువల నిర్మాణం లేక పోవడంతో రైతాంగానికి పూర్తిస్థాయిలో హంద్రీ-నీవా నీటిని నోచుకోలేని గ్రామాలు చాలా ఉన్నాయన్నారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చివరి ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందించడంలో భాగంగా తక్షణమే పంట కాలువల నిర్మాణం పూర్తి చేసి మండల రైతాంగాన్ని ఆదుకోవాలని వారు తెలిపారు. నేటి వరకు హంద్రీ-నీవా నీళ్లకు నోచుకోని మిగులు గ్రామాల రైతాంగాన్ని ఆదుకోవడంలో భాగంగా సాగునీరు, తాగునీరు అందించడంలో వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి వడ్డె. రాజశేఖర్, ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు నాగరాజు, నల్లచెల్లిమల శాఖ కార్యదర్శి బజారి, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రామాంజనేయులు, సిపిఐ మండల నాయకులు రంగన్న, రంగస్వామి, నరసింహులు, చంటి, నరసింహులు, కోదండ, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: నగర పాలక సంస్థ ప్రజా రోగ్య విభాగంతో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప కోరారు. శుక్రవారం నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట ప్రజా ఆరోగ్యం విభాగం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మునెప్ప మాట్లాడు తూ 2013 ప్రావిడెంట్‌ఫండ్‌కు సంబంధించి ప్రస్తుత ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు,లోడర్ల కార్మికుల వేతనాల నుంచి ఒకేదఫా రూ18వేలు పీఎఫ్ కింద రికవరీ చేయడం సరికాదన్నారు. నాలుగు విడతలుగా రీకవరి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.ఔట్ సోర్సింగ్ కార్మికులకు 2024 సమ్మె కాలపు వేతనాలు చెల్లింపు,యూనిఫామ్, స్టిచ్చింగ్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలన్నారు.2024 సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వ హించిన కార్మికులకు ఎన్నికల భత్యం ఇవ్వాలని కోరారు. 2024-25కు సంబంధించి యూనిఫామ్,కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వాలన్నారు. ఇంకా హెల్త్ కార్డులు, ఏపీజీఎల్ఐ బాండ్లు,ఆదివారం రోజు సెలవు వంటి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం కమీషనర్ పీవీ. రాముంగేశ్వర్‌కు సమస్యల కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్,ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పులగం మద్దిలేటి,నాయకులు సవారీ, నాగేంద్ర, మాణిక్యం, ఎల్లప్ప, జయరాం,మల్లికార్జున, సాయి పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌ను విధుల నుండి తొలగించాలి

విశాలాంధ్ర-మంత్రాలయం : బీసీ హాస్టల్ వార్డెన్‌ను తొలగించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బీసీ హాస్టల్ విద్యార్థులతో తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న విద్యార్థులకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఇష్టానుసారం హాస్టల్ కు రావడం తప్ప విద్యార్థుల గురించి పట్టించుకోకుండా పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నటువంటి బీపీ హాస్టల్ వార్డెన్ వెంటనే విధుల నుండి తొలగించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్రకి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేష్ నాగరాజు రామస్వామి మురళి కృష్ణ రాజేష్ విద్యార్థు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఆలూరు: మండల పరిధిలోని హత్తిబెళగల్‌లో రూ. 10 లక్షల నిధులతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే విరుపాక్షి, ఎంపీపీ రంగమ్మ, పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతిగ్రామం అభివృద్ధి చెందాలని మౌలిక వసతులు కల్పించాలని రోడ్లు, తాగునీటి వసతి, కల్పించాలని నాతాపత్రయమన్నారు. నియోజకవర్గంలో చేయాల్సిన వేదవతి రిజర్వాయర్ పనులు చాలా ఉన్నాయన్నారు. నిధులు రాగానే అన్ని గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సమస్యలు పూర్తిగా నిర్మూలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మౌల, ఎంపీటీసీ యమునప్ప, మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైడే ఫ్రైడే నిర్వహించిన వైద్య సిబ్బంది

విశాలాంధ్ర-గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో శుక్రవారం 4వ సచి వాలయంలో డ్రై డే ఫ్రైడేను కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గొల్ల వీధిలో మరియు దాని చుట్టుపక్కల ఇళ్లదగ్గర ఉన్న నీటి నిల్వలేనటువంటి గచ్చులను డ్రమ్ములను పరిశీలించి లార్వా ఉన్న వాటిని తొలగించాలన్నారు. ఇంటి యజమానులకు నీటినిలు పైన ఖచ్చితంగా మూత ఉండేటట్లు చూసుకోవాలని, పరిసర ప్రాంతాలలో నీటినిలువలు చూసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్వైజర్ హనుమంతు, ఏఎన్ఎం రాజమ్మ, ఆశలు కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.

బొడ్డువానిపల్లె వీరాంజనేయ స్వామి ఆశీస్సులు పొందండి

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : కర్నూలు ఓర్వకల్లు మరియు కల్లూరు మండలం లో వెలిసిన బొడ్డువాని పల్లె వీరాంజనేయ స్వామి వారి ఆశీస్సులు పొందాలని ప్రజలు గ్రామస్తులు భక్తులు అన్నారు ఈ నెల 4న ఆదివారం అమావాస్య రోజున స్వామివారి ఆశీస్సులు పొందేందుతూ భక్తులు పాల్గొని స్వామి వారి మొక్కులు చెల్లించుకుంటున్నారు ఆలయ కమిటీ వారు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని పునఃప్రారంబించాలి-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-దేవనకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే పునఃప్రారంభించాలని,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈప్రాంతంలో ఉపాధి కోసం ఇతరప్రాంతాలకు వలసలు వెళున్నారని,వెళ్లే సమయంలో వారి పిల్లల చదువులకై ప్రభుత్వ పాఠశాలల్లో వదిలి వెళ్లడం జరుగుతుందన్నారు. మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యయప్రయాసాలతో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. చదువుకునేందుకు పాఠశాలలు ఉన్నా, ఉండేందుకు వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా డిఎన్‌టి వసతి గృహం ఉండేదని,పక్కా గృహం లేదని, ఇతర కారణాలు చూపి,నిర్వహణ లోపంతో మూసివేయడం ఏంటని ప్రశ్నించారు.వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు టీసీలు తీసుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారన్నారు. మండల కేంద్రంలోబాలికల వసతి గృహం లేకపోవడంతో కర్నూలు,ఆదోని తదితర ప్రాంతాలకు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించిన, వాటిని గాలికొదిలేశారని ఆరోపించారు. దశల వారీ ఉద్యమాల్లో భాగంగా రాస్తారోకో నిర్వహిస్తున్నామన్నారు. బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించి,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు మరిన్ని చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుమధు,భాస్కర్,నాయకులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ-ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కేరళ రాష్ట్రంలో వాయనాడ్ జిల్లాలో అకాల వర్షాలతో సర్వస్వం కోల్పోయిన,వరద బాధితుల సహాయార్థం కర్నూలు నగరంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కిరాణం షాపులు, పండ్ల వ్యాపారస్తుల, రోడ్డుసైడ్ వ్యాపారస్తుల దగ్గర విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసులు నగర కార్యదర్శి బిసన్నలు మాట్లాడుతూ పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మానవుల సర్వస్వం కోల్పోతారని అలాంటి వారికి తోటి మనుషులుగా వారికి భరోసా కల్పించే విధంగా సహాయక చర్యలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. 2009లో కర్నూలు నగరాన్ని వరదలు ముంచెత్తినప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తో పాటు దేశ నలుమూలల నుండి కర్నూలు ప్రజలకు అండగా నిలిచారన్నారు. మనం ఇప్పుడు కేరళ రాష్ట్రానికి అండగా నిలిచి సర్వస్వం కోల్పోయిన వారికి ధైర్యం నిలిపే విధంగా సహాయక చర్యలో పాల్గొనాలని అందులో భాగంగానే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నగదు రూపంలో విరాళాలు సేకరించడమే కాకుండా బాధితులకు అవసరమైన దుప్పట్లు, మెడిసిన్, ఆహార వస్తువులతో అన్నింటిని ఏఐవైఎఫ్ రాష్ట్రసమితి ద్వారా కేరళ రాష్ట్రానికి పంపించడం జరుగుతుందన్నారు. నగర ప్రజలు ఏఐవైఎఫ్ విరాళాల సేకరణకు స్వచ్ఛందంగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బాబయ్య, నగర నాయకులు చంటి రాజశేఖర్ నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామిని పాల్గొన్నారు.

ఎం.వి.కొట్టాల పాఠశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-తుగ్గలి: పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యాశాఖాధికారి రామ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు.పిల్లలకు రోజు పాటించవలసిన మెనూ పాటించకుండా భోజనం నాణ్యత లేకుండా వంట చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.అలాగే వంట ఏజెన్సీ వారు ముగ్గురు ఉండాల్సిన చోట ఒక్కరే ఉన్నారని మిగతా ఇద్దరిపై సంజాయిసి కోరినట్లు తెలుపారు.అలాగే మండలంలో ఎవరైనా వంట ఏజెన్సీ వారు పిల్లలకు మెనూ ప్రకారం అందించాల్సిన భోజనం ను అందించక పోతే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి-ఏడీఏ మహమ్మద్ ఖాద్రి

విశాలాంధ్ర-గోనెగండ్ల: ఖరీఫ్ 2024కి చెందిన పంట నమోదు ప్రతి రైతు తప్పకుండ చేసుకోవాలని ఏడీఏ.ఎస్. మహమ్మద్ ఖాద్రి, మండల వ్యవసాయ అధికారిణి హేమలత,లుఅన్నారు.మండల కేంద్రమైన గోనెగండ్ల లో స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాం ఇన్చార్జి మల్లికార్జున మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడం వలన రైతులకు అందవలసిన అన్ని పథకాలు వర్తిస్తాయని, రైతులందరు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ఇంచార్జెస్ ను కలిసి తమ పొలాల్లో సాగుచేసుకొన్న పంటలనునమోదుచేసుకోవాలని తెలిపారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



విశాలాంధ్ర-కౌతాళం: భారత స్వాతంత్ర సమర యోధుడు, భాషా శాస్త్రవేత్త, భూ విజ్ఞాన శాస్త్రవేత్త, జాతీయ త్రివర్ణ పతాక రూపకర్త, పింగళి వెంకయ్య 149వ జయంతి వేడుకను ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సయ్యద్ దూద్ భాష మాట్లాడుతూ పింగళి వెంకయ్య జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శమయమని, ఈయన మహాత్మా గాంధీజీ కి సమకాలీకులు ఒకరని 1921 ఏప్రిల్ విజయవాడ పర్యటన సందర్భంగా గాంధీజీకి జాతీయ పతాకాన్ని బహుకరించారు భారత జాతీయజెండా దేశానికే గర్వకారణమని, అఖండ భారతావని సగర్వంగా ఆవిష్కరించుకునే మువ్వన్నెల జాతీయ జెండాను జాతికి ఇచ్చిన అక్కయ్య గారి గురించి చెప్పాలంటే అంతా- ఇంత కాదు కాబట్టి ప్రతి విద్యార్థి క్రమశిక్షణ నైతిక విలువలు కలిగి ఇలాంటి ఆదర్శమూర్తులమార్గంలో వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది "నేటి బాలలే రేపటి పౌరులు" అన్న నానుడి ప్రతి యువకుడు చెడు మార్గంలో చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి ఉన్నతమైన భవిష్యత్తును మనకు మనమే నిర్మించుకోవాలని సూచించారు.

పుట్టిన పిల్లలకు తల్లిపాలే ముద్దు..!

విశాలాంధ్ర-పత్తికొండ: పుట్టిన పిల్లలకు తల్లిపాలు ముద్దని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండ్ డా.కల్పన తెలిపారు. ప్రపంచ తల్లిపాలు వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పత్తికొండ ప్రభుత్వ హాస్పిటల్‌లో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా పెరిగి అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల వారు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, బిడ్డలకు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వవచ్చున్నారు. తల్లిపాలు రెండేళ్ల వరకు లేదా వీలైనంత ఎక్కువకాలం ఇప్పించడం సరైన పోషణ విధానమన్నారు.తల్లిపాలతో పిల్లలకు పోషకాహార లోపం, అధికబరువు, స్థూల కాయత్వం, ఆహార సంబంధిత జబ్బులైన చక్కెరవ్యాధి, గుండెజబ్బులు, క్యాన్సర్ వంటివి దరిచేరకుండా తల్లిపాలు నివారిస్తాయన్నారు. అంగన్వాడి సెంటర్‌లో బాలామృతం కూడా పిల్లలకు ఎంతో పనిచేస్తుందని సూచించారు. ప్రతితల్లి కూడా పిల్లలకు తల్లిపాలు ఇచ్చే విధంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుంకులమ్మ.గౌతమి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల కేంద్రమైన1,2,12, వార్డుల్లో హెల్త్ సిబ్బంది శుక్రవారం ఆధ్వర్యంలో బాలింతలకు సమీనా,జ్యోతి, మాబున్ని, షబానా, అరుణ హెల్త్ డిపార్ట్మెంట్ రంగవేణిమ్మ ఆశావర్కర్స్ బజారమ్మ రిజ్వానలు అవగాహన కల్పించారు.చిన్నపిల్లల తల్లులకు, ముర్రు పాలు పట్టించడం వలన కలిగే ప్రయోజనాలపై వివరించారు.

శ్రావణ మాసోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

విశాలాంధ్ర-ఆదోని: శ్రావణ మాసం ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసు కోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివ్ నారా యణ్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో 2024 శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా భక్తులకు వివిధ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 5 నుండి సెప్టెంబర్ 3 వరకు జరిగే శ్రావణమాస ఉత్సవాలకు ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, శానిటేషన్, పార్కింగ్, బారికేడ్లు, బస్సు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. భక్తులకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉత్సవ సమయంలో నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు అమ్మకాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతతో పాటు బారికేడ్లు, సిసి ఫుటేజ్ కెమెరా ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు అధికారులు నిరంతర నిఘా ఉత్సవాలను విజయవంతంగా చేయాలని అధికారులకు సూచించారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలి

- గత ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది
- మెడికల్ కళాశాలల్లో ఫీజులను నియంత్రించాలి
- పార్లమెంట్ లో కేంద్రాన్ని కోరిన ఎం.పి బస్తిపాటి నాగరాజు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ స్థాయిలో అభివృద్ధి చేయాలని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు పార్లమెంట్‌లో కేంద్రాన్ని కోరారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా జీరో అవర్ లో ఆయన మాట్లాడారు.కరువు ప్రాంతమైన కర్నూలు జిల్లాలో చెప్పుకోవడానికి ప్రభుత్వాసుపత్రి ఒక్కటే ఉందని, 8 జిల్లాల ప్రజలకు వైద్య సదుపాయాలను అందిస్తున్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తే రోగులకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు..ఇక గత వైసీపీ ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేయడంతో, ఆసుపత్రుల్లో కనీస మౌలిక సదుపాయలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగన్ వైద్య యూనివర్సిటీలకు పేర్లు మార్చుకోవడం తప్ప వైద్య రంగాన్ని పట్టించుకోక పోవడంతో రాష్ట్రంలో 2659 ఉన్న ఆసుపత్రుల్లో 1232 ఆసుపత్రులు పని చేయడం లేదన్నారు..2014 టీడీపీ హయాంలో వైద్య సేవలు అందిచడంలో 4వ స్థానంలో ఉంటే, జగన్ ప్రభుత్వంలో 10వ స్థానంలోకి పడిపోయిందన్నారు..ఇక వైద్య కళాశాలల్లో అధిక ఫీజులుడడంతో, అక్కడ చదువుకొని వైద్యులు అయిన వారు వైద్యాన్ని ఆదాయ వనరులుగా చేసుకుంటున్నారని, మెడికల్ కాలేజీలలో ఫీజులను నియంత్రించాలని కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో టెక్నాలజీని పెంపొందించి, ప్రైమరీ హెల్త్ సెంటర్లను అభివృద్ధి చేయాలన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో నైతిక విజయం టీడీపీ దే..!

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాల గురించి వైఎస్ జగన్ పేపర్లో రాసిన కథనాలపై తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మౌర్య ఇన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమకు 15 మంది కార్పొరేటర్లు ఉన్నారన్నారు. తమకు మొత్తం 75 ఓట్లు రావాల్సి ఉండగా 106 ఓట్లు వచ్చాయని తెలిపారు. 31 ఓట్లు అదనంగా వైసీపీ కార్పొరేటర్లు వేసినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. దీన్ని బట్టి వాపు ఎవరిదో, బలం ఎవరిదో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఫలితాలను బట్టి ఎవరిది నైతిక విజయమో వారే ఆలోచించుకోవాలని హితవు పలికారు. మంత్రి టి.జి భరత్ స్థానికంగా లేకపోయినప్పటికీ సాక్షి కథనాల్లో మంత్రి వ్యూహం విఫలమైందని రాయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వైసీపీ నాయకులే క్యాంపు రాజకీయాలు చేసి వారి కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురిచేసి ఓట్లు వేయించుకున్నారన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేటర్లు కురువ పరమేష్, విజయ కుమారి, కైపా పద్మలతా రెడ్డి, సుజాత, తెలుగుయువత పార్లమెంటు అధ్యక్షుడు అబ్బాస్, సీనియర్ నాయకులు గున్నామార్క్, మోయిన్ బాషా, ఖాదర్ బాషా, సుంకన్న, స్వామిరెడ్డి, అకీమ్, రామాంజనేయులు, శేషు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముఖ్య కార్యనిర్వాహణాధికారి నాసరరెడ్డి

విశాలాంధ్ర-కల్లూరు: సీజనల్ రైతుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలాగే పరిసరాలను తాగునీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహనాధికారి నాసర రెడ్డి సూచించారు.

ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని కొంగణపాడును సందర్శించి కాలువలు షేడ్ ఓవర్ హెడ్ ట్యాంక్ సంప్ నీటి క్లోరినేషన్ పరీక్షలు, కుష్ఠ లెప్రసీ సర్వే సచివాలయం పరిశీలన పారిశుధ్య పనులు మరియు తాగు నిటీ సమస్య (డైయేరియా డెంగీ మలేరియా వ్యాధులకు నివారణ చర్యలు) మొదలైనవి పరిశీలించినారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ కిషోర్, పంచాయతీ సెక్రటరీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: నగరంలో ట్రాఫిక్ రద్దీ, రోడ్డుకు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని నగర పాలక కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. శుక్రవారం నగరపాలక కౌన్సిల్ హాలులో ట్రాఫిక్ సీఐ గౌతమి, నగరపాలక పట్టణా ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి రోడ్డు సేఫ్టీ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. గత నెల 25న జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించారు. వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, కలిగే ఆటంకాలకు పరిష్కారాలపై చర్చించారు. అలాగే మెడికల్ కాలేజీ వద్ద మలుపు విస్తరణ, మద్దూర్ నగర్ నుండి సి.క్యాంపు వరకు రోడ్డు డెవలప్మెంట్ ప్లాన్ రూపకల్పన, చెక్‌పోస్ట్-నందికొట్కూరు రోడ్డుకు నగర సరిహద్దు వరకు రోడ్డు విస్తరణకు మార్కింగ్, ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్ల తొలగింపు, వారి కోసం జోన్ల ఏర్పాటు, నిర్మాణాలు జరుగుతున్న చోటు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు గుర్తించేలా బారియర్స్ ఏర్పాటు, 9 బస్‌షెల్టర్ల నిర్మాణం, సిసి కెమెరాలు ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మరో ఫూత్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళిక తయారు అంశాలపైనా చర్చించి, వాటి అమలుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ సంబంధింత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈలు షాకీర్, శేషసాయి, డిసిపి సంధ్య, ఏసిపి మంజులత తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 03, ఆగస్టు 2024

నలుగురు నిందితుల అరెస్టు.. మరో నిందితుడి కోసం గాలింపు

విశాలాంధ్ర–కోడుమూరు: గత నెల 29వ తేదీన బెళగల్ మండల పరిధిలోని కొత్తకోట గ్రామ శివారులోని సుంకేసుల కరకట్ట దగ్గర పడి ఉన్న వ్యక్తి మృత దేహం కేసును కోడుమూరు సర్కిల్ పోలీసులు ఛేదించి, ఆ వ్యక్తిని హత్య చేసిన నలుగురు నిందితులను పట్టుకొని అరెస్టు చేశారు. ఇదే కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ కేసుపై కోడుమూరు సిఐ మన్సురుద్దీన్ శుక్రవారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించిన మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి... సి.బెళగల్ మండలం,కొత్తకోట గ్రామ పరిధిలోని సుంకేసుల కరకట్టలో కొందరు వ్యక్తులు ఒక వ్యక్తి మృతదేహం పడేసి వెళ్లినట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్నామన్నారు. దీనిపై సి బెళగల్ స్టేషన్లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.అయితే మృతదేహాన్ని అక్కడ పడేసే క్రమంలో నిందితులు సి.బెళగల్ మండలం పరిధిలోని మునగాల, సుంకేసుల, కొత్తకోట తదితర గ్రామాల శివారులలో సంచరించినట్లు కొన్ని ఆధారాలు లభించాయన్నారు. దీంతో కేసు దర్యాప్తులో భాగంగా తెలంగాణ రాష్ట్ర గద్వాల జిల్లా రాజోలి పోలీసులకు సమాచారం అందించినట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నిందితులు రాజోలి ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందుకొని, అక్కడ వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు,ఒక బొలెరో వాహనం తోపాటు హత్యకు ఉపయోగించిన కర్రను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. దర్యాప్తులో భాగంగా అరెస్టు చేసిన నలుగురు నిందితులను విచారించగా గత కొంత కాలంగా నాయకి చిన్న శేసిరెడ్డి, నాయకి మహేష్‌ల మధ్య పొలం తగాదా గొడవలు ఉన్నాయన్నారు. వీరి తాత నాయకి గోకారికి చెందిన ఎకరా 10 సెంట్లు భూమి విషయంలో నాయకి మహేష్ నిందితులతో కలిసి హత్యకు రూపకల్పన చేసి,హతుడు చిన్న శేషిరెడ్డిని తిమ్మారెడ్డి పొలంకు రప్పించి మద్యం సేవించి, చచ్చిన రహితంగా కొట్టి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ హత్య కేసులో మొదటి ముద్దాయిగా గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద దాన్వాడ గ్రామానికి చెందిన నాయకి చిన్న నాగిరెడ్డి, రెండవ ముద్దాయిగా నాయకి మహేష్ లను, గద్వాల జిల్లా,మల్దకల్ మండలం, చెందిన తిమ్మారెడ్డిని నాలుగో ముద్దాయిగా, ఐదవ ముద్దాయిగా గద్వాల జిల్లా మల్దకల్ మండలం శేశం పల్లి గ్రామానికి చెందిన బోయ జనార్ధన్ లుగా గుర్తించి, వీరిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు. మూడవ ముద్దాయిగా పెద్దధన్వాడ గ్రామానికి చెందిన నాయకి పెద్ద శేషిరెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టామని త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో కోడుమూరు గూడూరు సిబెళగల్ ఎస్సైలు బాలనరసింహులు, హనుమంతయ్య, తిమ్మారెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు ఘన నివాళ్లు

విశాలాంధ్ర – నంద్యాల : జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి సందర్భంగా పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయం, నంద్యాల నందు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రంథాలయ సిబ్బంది శ్రీధర్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమర యోధుడు, భారత దేశ జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమయంలో పోరాటం చేసిన వారిలో పింగళి కూడా ఒకరని, భారతదేశానికి ఒక జాతీయ పతాకం అనే గ్రంథాన్ని రచించారన్నారు. శ్రీహరి మాట్లాడుతూ మహాత్మా గాంధీ సూచనలనుఅనుసరించి పింగళి దానిపై రాట్నం గుర్తు చేర్చారని, స్వాతంత్ర్యానంతరం నెహ్రూ సూచన మేరకు రాట్నం స్థానంలో అశోకచక్రం వచ్చి చేరిందన్నారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఆయన మనకందించిన మువ్వన్నెల జెండా మన ముందు రెపరెపలాడుతూనే ఉందని పింగళి వెంకయ్యని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఆర్‌ఈ శ్రీధర్, డి.మధు, గ్రంథాలయ పాఠకులు లింగమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర–పెద్దకడబూరు : ఉపాధి పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడి లోకేశ్వర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక ఎస్సీ కాలనీలో ఏపీఓ ఖాదర్ బాష ఆధ్వర్యంలో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఖచ్చితమైన కొలతలతో పని చేస్తే ఎక్కువ వేతనం పొందవచ్చునని తెలిపారు. కొంత మంది కూలీలు ఆలస్యంగా పనులకు వస్తారని, దీంతో తమకు తక్కువ వేతనాలు పడతాయని కూలీలు ఏపీడి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రామ్మోహన్ రెడ్డి, రాజు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర – చాగలమర్రి : బయో మందులు కాని మరే ఇతర మందులు, నకిలి బిల్లులు లేనివి ఉన్నను,విక్రయించిన చట్ట పరమైన చర్యలు చేపడతామని మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ హెచ్చరించారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్ల సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజి మాట్లాడుతూ విత్తన, ఎరువులు, పురుగు మందుల యొక్క చట్టాలలో చేసిన మార్పులు, ప్రతి డీలర్ అమ్మకాల స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. విత్తన, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన స్టాకు, ధరల పట్టికను ఎప్పటికప్పుడు రైతులకు కనిపించే విధంగా ఉంచాలని తెలిపారు. రైతులు తప్పకుండా తాము కొన్న వాటికి ప్రతి డీలర్ బిల్ ఇవ్వాలని ఏవైన ఫిర్యాదులు వచ్చినచో లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ

విశాలాంధ్ర – ఆత్మకూరు టౌన్ : ఆత్మకూరు పట్టణంలోని ఎంఎం ఫంక్షన్ హాల్ నందు గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు రఘు రామాచార్యులు ఆధ్వర్యంలో 2024 నూతన విద్య సంవత్సరానికి నూతన విద్యార్థులకు స్వాగతం పలికిన సీనియర్ విద్యార్థిని, విద్యార్థులు ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు ఆత్మకూరు మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర సెల్ మైనారిటీ కార్పొరేషన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, వంగాల శివరాం రెడ్డి, మల్లికార్జున, రాజారెడ్డి, వలిఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుతూ తల్లితండ్రుల పట్ల గురువుల పట్ల భక్తి శ్రద్ధలతో మేలు గుతూ చెడువేసినలకు బానిసలు కాకుండా ఎన్నో ఉన్నత శిఖరాలను చేరాల న్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఈసారి టీడీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుందన్నారు.

తల్లిపాల వార్షికోత్సవాలు

విశాలాంధ్ర – ఆత్మకూరు రూరల్ :పట్టణంలోని అర్బన్ కాలనీ నందు 3, 6, 7, 11 ,28, 33, 38లకు సంబంధించిన సచివాలయంలో ప్రపంచ తల్లిపాల వార్షికోత్సవం సందర్భంగా హెల్త్ డిపార్ట్మెంట్, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లిపాలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను, తల్లిపాలు ఇవ్వకపోవడం వలన కలుగు నష్టాలను తెలిపారు. తల్లి తప్పనిసరిగా ప్రసవం అయినా గంటలోపు ముర్రుపాలను పట్టించాలని, అంతేకాకుండా ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని తెలిపారు. దీనివల్ల రొమ్ము గర్భాశయ క్యాన్సర్లను నివారించవచ్చని, శిశువు మేధస్సును పెంచుతుందని, శిశువులకు నిమోనియా రాకుండా తల్లిపాల ద్వారా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి, ప్రశాంతి, లక్ష్మీదేవి, అంగన్వాడి ఆశ లు భారతి, అపర్ణ, వరలక్ష్మి, లక్ష్మీదేవి, విజయ గౌరీ, దేవి, శోభ, శారద, పర్వీన్ పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు: ఓర్వకల్లు ఎయిర్పోర్ట్‌లో రన్ వే ఎక్స్టెన్షన్, విమానాలు రాత్రి సమయంలో ల్యాండ్ అయ్యేందుకు వీలుగా రన్ వే కల్పించాల్సిన సౌకర్యాలు, కావలసిన నిధుల వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఎయిర్పోర్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఓర్వకల్ ఎయిర్పోర్ట్‌లోని ఎయిర్పోర్ట్ డైరెక్టర్ ఛాంబర్‌లో రన్ వే ఎక్స్టెన్షన్, నైట్ ల్యాండింగ్, ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ అంశాల పై ఎయిర్పోర్ట్ డైరెక్టర్ తో, ఇండస్ట్రియల్ అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓర్వకల్లు ఎయిర్పోర్ట్‌ను పరిశీలించారు. అనంతరం రన్ వే ఎక్స్టెన్షన్ ఎక్కడ నుండి ఎంతవరకు కావాలి, ఏ లొకేషన్‌లో కావాలి, అనే వివరాలను ఎయిర్పోర్ట్ డైరెక్టర్ ని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశం అయి ఈ అంశంపై చర్చించారు. ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్ భూసేకరణ, అప్రోచ్ రోడ్ల ఏర్పాటు పై అధికారులతో చర్చించిన జిల్లా కలెక్టర్ ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్ అంశంపై కలెక్టర్ అధికారులతో చర్చించారు.. సంబంధించిన మ్యాప్ ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అందుకు సంబంధించిన వివరాలను జోనల్ మేనేజర్ ని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్ కి ప్రత్యామ్నాయ అప్రోచ్ రోడ్లు ఏర్పాటు, భూసేకరణ పై అధికారులతో చర్చించారు.ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్ కి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఓర్వకల్లు తహశీల్దార్ వెంకటరమణ, ఎంపిడిఓ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాదిగల చిరకాల కోరిక నెరవేరింది

విశాలాంధ్ర–పెద్దకడబూరు : మాదిగలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పుతో నెరవేరిందని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు బొగ్గుల కోడిగుడ్ల ఏసేపు అన్నారు.శుక్రవారం పెద్దకడబూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం చేసిన పోరాటాల ఫలితంగా సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదే అని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేశారని, అప్పుడు అనేక మంది ఎస్సీ ఉపకులాలు మాదిగలు రిజర్వేషన్ ఫలితాలు దక్కించుకున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడినట్లు ఆయన గుర్తు చేశారు. ఎస్సీవర్గీకరణకు పోరాటం చేసిన ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ, సహకరించిన ప్రధాని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అధికారుల తీరు మార్చుకోకపోతే చర్యలు

విశాలాంధ్ర – కల్లూరు: తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది తమ తీరు మార్చుకోవాలని లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తహశీల్దార్ కే రామాంజనేయులు సిబ్బందికి సూచించారు. శుక్రవారం కల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో పలు రకాలుగా వచ్చిన అర్జీలను తహశీల్దారు పరిశీలించి సంబంధిత అధికారుల సంతకాలపై ఆరా తీశారు. వాటిలో వీఆర్వో సంతకం మాత్రమే ఉండి ఆర్ఐ, డిప్యూటీ తమశీల్దార్, జూనియర్ అసిస్టెంట్ తదితర వారి సంతకాలు అర్జీలపై లేకపోవడంతో తాను ఫైలు కరెక్ట్‌గా ఉంటేనే సంతకాలు పెడతానంటూ తన ఛాంబర్ లోకి వచ్చిన ఫైళ్లను తిరిగి బయటికి సంబంధిత అధికారుల దగ్గరికి పంపారు. అందులో భాగంగా కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, నాన్ అవైలబిలిటీ, మరణ, జనన ధ్రువీకరణ, అన్ మ్యారిడ్ సర్టిఫికెట్లు, ఆన్లైన్ సమస్యలు తదితర రకాల దరఖాస్తుల ఫైళ్లపై ఆర్ఐ రాజేంద్ర తో తప్పనిసరిగా సంతకాలు చేయించి జూనియర్ అసిస్టెంట్ ప్రతి ఫైలు వెరిఫై చేసి రికార్డులో నమోదు చేసిన తర్వాతనే తాను సంతకాలు పెట్టడం జరుగుతుందన్నారు. కట్టలు కట్టలుగా ఉన్న అర్జీదారుల దరఖాస్తులను ఆయా శాఖల ముందు ఉంచి సంతకాలు చేయించారు. ఈ క్రమంలో ఆర్ఐ రాజేంద్రకు ఒకవక్క సంతకాలు చేయడం, మరో పక్క ఫ్యామిలీ ఆసుపత్రిలో చూయించుకోవాలని, ఆస్పత్రి దగ్గర గంటల తరబడి వెయిట్ చేస్తున్నామంటు మరో పక్క కుటుంబంలో ఫోన్ కాల్స్ రావడంతో ఆయన తర్జనభజన చెందారు. మరోపక్క జూనియర్ అసిస్టెంట్‌కి పలు రకాల పనులు ఎక్కువగానే ఉండడంతో దరఖాస్తులను కూడా వెరిఫై చేసి రికార్డులను నమోదు చేయాలని కొండంత భారమైన పని అని వాటితో పాటు కార్యాలయంలో పనిచేసే పలువురులు చర్చించుకోవడం శోచనీయం. ఇలా ఉంటే రోజుల తరబడిన అర్జీదారులకు న్యాయం జరగడం కష్టతరం అవుతుందని పలువురు సీనియర్ అధికారులు తమశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆయన మాత్రం తాను చెప్పిందే వేదం అంటూ ఏమైనా పొరపాటు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అని అలవోకగా సమాధానం ఇచ్చి అధికారుల పనితీరు మార్చుకొని సమయం కేటాయించి నిక్కచ్చిగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు రెవెన్యూ సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఇదంతా ఒత్తిడి తనకు అనువైన అధికారులను చేర్చుకునేందుకు ఇలా సిబ్బందిపై వచ్చిన రోజే ఒత్తిడి పెట్టి రెవెన్యూ అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కార్యాలయంలో పనిచేసే సిబ్బంది పేర్కొంటున్నారు.

పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేయండి

విశాలాంధ్ర–పెద్దకడబూరు : పాఠశాలల్లో జరిగే పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేసి క్లీన్ స్వీప్ చేయాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు నరవ శశిరేఖ దంపతులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దకడబూరు గ్రామంలోని నరవ స్వగృహం నందు టీడీపీ టౌన్ అధ్యక్షులు మల్లికార్జున అధ్యక్షతన పేరెంట్స్ కమిటీ ఎన్నికలకు సన్నద్ధంలో భాగంగా టీడీపీ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరవ దంపతులు మాట్లాడుతూ నరవ దంపతులు మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కష్టపడి పని చేసి పెద్దకడబూరు మండలం నుండి అఖండ మెజారిటీ సాధించి పెట్టిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికల జరుతాయని, అన్ని పాఠశాలల్లో టీడీపీ సానుభూతి పరులే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికయ్యేలా చూడాలని, వైసీపీకి అవకాశం ఇవ్వొద్దని హితవు పలికారు. మండలంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరి సేవలు ఎప్పటికీ మరువమని అన్నారు. తమను నమ్ముకున్న వారి కోసమే రాజకీయాల్లో పని చేస్తున్నామని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఒకేసారి అందరికీ న్యాయం చేయలేమని, విడతల వారిగా ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తాము నీతి నిజాయితీకే కట్టుబడి ఉంటామని, కార్యకర్త కోసం ఎందాకైనా వెళుతామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మీసేవ ఆంజనేయులు, తలారి అంజి, వీరేష్ గౌడ్, నరసన్న, బొగ్గుల తిక్కన్న, నరసింహా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సత్యన్న గౌడ్, లక్ష్మికాంతరెడ్డి, బొగ్గుల నరసన్న, లక్ష్మన్న, భీమరాయుడు, తాయన్న, హజరత్ వలి, మల్దకల్, చంద్రశేఖర్, మహాదేవ, రంగన్న, వెంకటరామిరెడ్డి, పెద్దయ్య, రాజశేఖర్, ఈరన్న, ఇమ్మానియేలు, ఆదాము అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు సురక్షితం

విశాలాంధ్ర–వెల్దుర్తి: మండల కేంద్రమైన 1,2,12, వార్డుల్లో హెల్త్ సిబ్బంది శుక్రవారం ఆధ్వర్యంలో బాలింతలకు సమీనా,జ్యోతి, మాబున్ని, షబానా, అరుణ హెల్త్ డిపార్ట్మెంట్ రంగవేణిమ్మ ఆశ వర్కర్స్ బజారమ్మ రిజ్వానలు అవగాహన కల్పించారు. చిన్నపిల్లల తల్లులకు, ముర్రు పాలు పట్టించడం వలన కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ప్రతి తల్లి ప్రసవించిన వెంటనే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వలన రోక నిరోధక శక్తిపెంపొందుతుందని మురుపాలు తాగిన పిల్లలు ఎంతో యాక్టివ్ గా ఉంటారని, తల్లిపాలలో రోగ నిరోధక శక్తిని పెంపొందించే గుణాలు ఉన్నాయని పుట్టిన ప్రతి బిడ్డకు ముర్రుపాలు పట్టించడమే మొదటి టీకాగా ప్రతితల్లి భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమీనా, జ్యోతి, మాబున్ని, షబానా, అరుణ హెల్త్ డిపార్ట్మెంట్ రంగవేణిమ్మ ఆశ వర్కర్స్ బజారమ్మ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతంతో సమానం

విశాలాంధ్ర – చాగలమర్రి : నవజాత శిశువుకూ తల్లి పాలు అమృతంతో సమానమని మండల వైద్యాధికారి అంజలి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీవో తేజేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం గర్భిణీలు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపు ప్రతి శిశువుకూ ముర్రుపాలు తాగించలన్నారు. మాట్లాడుతూ శిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. తల్లిపాలు బిడ్డలో వ్యాది నిరోధకశక్తి పెరుగుదలకు దోహదపడతాయన్నారు. నవజాతి శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు, తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల,హెల్త్ సూపర్వైజర్ రాంలింగారెడ్డి, జీఎంఎస్‌కేలు ప్రసన్న, జగదీశ్వరి, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర–పత్తికొండ: మహిళలకు రక్షణ కల్పించాలని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం పత్తికొండలోని ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజుల లోపే మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో అత్యాచారానికి గురై 25 రోజులు గడిచినా చిన్నారి మృతదేహాన్ని కనిపెట్టలేక గాలింపు చర్యలను నిలిపివేయడం ప్రభుత్వ చేతగాని తనం స్పష్టమవుతుందన్నారు. ముచ్చుమర్రి గ్రామానికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం శాఖ మంత్రి అనితలకు తీరిక లేదా అని సూటిగా ప్రశ్నించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ నారాయణ దాసు, సర్పంచులు శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీలు నెట్టేకల్, కృష్ణారెడ్డి, వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జయచంద్ర రెడ్డి, నాగప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయం

విశాలాంధ్ర–పత్తికొండ: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రామకొండ వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా అధ్యక్షులు పులికొండ మాదిగలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 30 సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు చేపట్టడం జరిగిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాదిగలకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తూ వర్గీకరణకు సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల ఆకాంక్ష నెరవేరింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఈశ్వరయ్య, నరసింహులు, రామ్మోహన్, రంగస్వామి, భీమా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ శ్రీనివాస్ నాయక్

విశాలాంధ్ర–ఆలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో పనిచేసిన వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లిపోవడంతో. ఇంకా ఆయన స్థానంలో కడప జిల్లా సిసిఎస్ లో పనిచేస్తున్న, శుక్రవారం ఆలూరు పోలీస్ స్టేషన్లో కార్యాలయంలో శ్రీనివాస్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కార్యాలయంలో పత్రిక విలేకరులతో మాట్లాడుతూ సిఐ బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం మరియు డిఐజి కి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో శాంతి భద్రతల పర్యవేక్షణ ధ్యేయంగా పటిష్ట చర్యలు తీసుకుంటామని. ప్రజలకు సేవ చేసేందుకు ఎల్లవేళ అందుబాటులో ఉంటామని. మహిళ రక్షణ, భద్రత నేరలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక నిగా పెడతామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సహకారం. సమన్వయంతో కలిసి పని చేస్తామన్నారు. సమస్యతో వచ్చిన ప్రతి ఒక్క బాధితుడికి తక్షణమే పరిష్కారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా డాభా..

విశాలాంధ్ర–ఆదోని రూరల్: మండలంలోని మదిరే గ్రామ ఎల్ఎల్సీ కాలువ దగ్గర ఉన్న దాబా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నెలకొందని చుట్టుపక్కల పొలాల రైతులు ఆరోపణలు చేస్తున్నారు. సర్వే నెంబర్ 318లో 18 సెంట్లు స్థలంలో సంతేకులూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు విజయ భాస్కర్ రెడ్డి దాభా నిర్మించారు. ఈ దాభాలో అసాంఘిక కార్య కలాపాలకు నిలయంగా మారిందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎల్లెల్సీ కాలవ నుంచి ఆదోని పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు పైప్ లైన్ నిర్వహించగా దాబా నిర్మాణం చేపట్టిన ప్రదేశంలో పంప్ హౌస్ ఉన్నప్పటికీ దాభా నిర్మాణం ఆగకుండా నిర్వహించారు.ఇదే పంప్ హౌస్ నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే వారని వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడంతో పంప్ హౌస్ వాడకంలో నిలిచి పోయిందని అక్కడి ప్రజలు తెలియజేస్తున్నారు. దాబా నిర్మాణం చేపట్టేటప్పుడు పంప్ హౌస్ ను మట్టితో పూడ్చేశారు. సర్వేనెంబర్ 318 లో 18 సెంట్ల స్థలం మాదేనంటూ సర్వేనెంబర్ 324 పొలానికి చెందిన రైతు వెంకటరావు అంటు న్నారు. ఆదోనికి చెందిన ఓ వ్యక్తి దగ్గర నుంచి ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. దాబా నిర్మాణం చేపట్టేటప్పుడు వైసీపీ నాయకుడు విజయ భాస్కర్ రెడ్డి మా అనుమతులు కోరగా, దాబా ఏర్పాటు చేసుకోండి, మేము ఎప్పుడు చెప్పితే అప్పుడు తొలగించాలని తెలియ జేసినప్పటికీ దాబాను నిర్మించిన యజ మాని సానుకూలంగా అంగీకరిం చడం జరిగిందన్నారు. పలు సందర్భాల్లో దాబాను తొలగించండని తెలియజేసిన తొలగించలేదన్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం అయినందున వైసీపీ ప్రభుత్వం లో ఇదే దాబాలో కర్ణాటక మద్యం దొరికి పోలీసులు కేసులు కట్టిన సంగతులు తెలిసిందే. దాబా నిర్మాణం చేపట్టిన 18 సెంట్లు స్థలాన్ని తమ పేరుపై ఆన్లైన్ అడంగల్ ఎక్కించాలనే సంబంధిత సచివాలయ రెవిన్యూ ఉద్యోగస్తులపై గత వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే అండ దండలతో అధికార పార్టీనేతలు ఒత్తిడి తీసుకు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అక్రమంగా నిర్మాణం చేపట్టిన దాభాను తొలగించి చుట్టుపక్కల పొలాల రైతులకు న్యాయం చేయాలని అక్కడి రైతులు